


**కీర్తి, కాంత, కనకం.. యుగాల నుంచి మనిషిని బురిడీ కొట్టించేవి ఇవే! మిగతా రెండిటి సంగతి ఏమో కానీ, అతివలపై అతిగా వలపు ప్రదర్శించే వాళ్లకు శృంగభంగం తప్పదని చాటే పురాణ కథలు ఎన్నో ఉన్నాయి. ఈ సాంకేతిక యుగంలోనూ అదే జరుగుతున్నది. కోమలాంగి కొంగు తగిలితే చాలనుకునే సుందరాంగులను సోషల్ మీడియాలో కొసరు అందాలతో రెచ్చగొట్టి.. ముగ్గులోకి దించుతున్నారు ఫ్రాడ్‌స్టర్లు. ఊహాలోకాల్లో విహరించే వారిని స్త్రీలు, పురుషులు అని తేడా లేకుండా రెచ్చగొట్టి.. పబ్బం గడుపుకొంటున్నారు. సామాజిక మాధ్యమాల్లో పొంచి ఉన్న ప్రమాదాల గురించి తెలుసుకున్నప్పుడే.. వాటి ఉచ్చులో చిక్కుకోకుండా తప్పించుకోవచ్చు.**

# వలపు వలలో.. విలవిల

గురునాథ్ (పేరు మార్చాం) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వయసు నలభై పైమాటే! ఒంటరివాడు! కాస్త తుంటరివాడు కూడా!! అతగాడి ఫేస్‌బుక్ అకౌంట్ చూస్తే 'గురునాథ్ అభినవ మన్మథుడు!' అని తెలిసిపోతుంది. ఇంకేముంది.. ఫ్రాడ్‌స్టర్లకు అప్పనంగా ఓ బకరా దొరికాడు. ఒక అందమైన అమ్మాయి లైన్‌లోకి వచ్చింది. ప్రేమగా పలకరించింది. తన పేరు సలోనీ అని చెప్పింది. తేనెలాంటి మాటలతో ఉక్కిరిబిక్కిరి చేసింది. టన్నులకొద్దీ కాదల్ కురిపించింది. పలకరింపులు 'ఓయ్.. ఏమోయ్..' దాటిపోయాయి. యవ్వారం వెర్రి మాటల దాకా వచ్చింది. గురునాథ్‌కు పిచ్చి పీక్స్‌కు చేరుకుంది. వన్ ఫైన్ నైట్.. వీడియోకాల్ చేయమని సలోనీ సందేశం. సందేహం రాలేదు అతనికి. వీడియోకాల్ చేశాడు. తెర మాటునున్న సలోనీ ముఖం అతనికి కనిపించలేదు. అయినా.. ఆమె కండ్లు మత్తెక్కించాయి. మాట మాయ చేసింది. హస్కీ వాయిస్.. లవ్లీ పలకరింపు.. విలువలు మర్చిపోయాడు. వలువలు విడిచేశాడు. గంటపాటు ఊహల్లో తేలిపోయాడు. సంతోషంగా పడుకున్నాడు.

మర్నాడు ఉదయం.. కాల్ వచ్చింది. అవతలి నుంచి పురుష గొంతుక. మర్యాద మచ్చుకైనా లేదు. బెదిరింపు ధోరణిలో.. 'నిన్న రాత్రి నువ్వు చేసిన విన్యాసాలు బయటికి పొక్కొద్దంటే... నేను చెప్పినట్టు చేయాలి, అడిగినంతా ఇవ్వాలి' అని హెచ్చరించాడు. గురునాథ్ బెంబేలెత్తిపోయాడు. బతిమాలేకొద్దీ అవతలి వ్యక్తి స్వరం పెంచాడు. చెప్పుకొంటే పోయే నేరమూ కాదాయె! ఫోన్‌లోనే కాళ్లు పట్టుకున్నంత పనిచేశాడు. వాళ్లు డిమాండ్ చేసిన మొత్తం పంపాడు. మర్నాడు మళ్లీ బెదిరింపు... ఈ సారి రెట్టింపు ఇవ్వాల్సిందేనని మళ్లీ డిమాండ్ చేశాడు. అప్పు చేసి మరీ ఇచ్చుకున్నాడు గురునాథ్. మర్నాడు మళ్లీ ఏం అడుగుతారో అనీ, తన పరువును ఎక్కడ గంగపాలు చేస్తారో అని క్షణమొక యుగంగా గడిపాడు. ఆ ఒత్తిడికి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు.

గురునాథ్ మాత్రమే కాదు.. సామాజిక మాధ్యమాలను అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా భావించే చాలామంది ఇలా మాయగాళ్ల ఎరకు చిక్కుకుంటున్నారు. పండంటి జీవితాన్ని సర్వనాశనం చేసుకుంటున్నారు. ఒంటరి మహిళలు, పెండ్లి కాని యువతులు కూడా బాధితులే! సోషల్ మీడియాలో పురుడు పోసుకునే వంద ప్రేమల్లో ఒకటి, రెండు మినహా మిగతావన్నీ కాలక్షేపం బాపతే! ఈ విషయం తెలియక, అభిరుచులు కలిశాయనీ, అందంగా ఉన్నాడని, కండలు తిరిగిన దేహం కలవారనీ.. యువతులూ జీవితాన్ని రిస్క్‌లో పెడుతున్నారు. ఆ వ్యక్తి నిజస్వరూపం చూడకముందే.. సిక్స్‌ప్యాక్ హీరోగా భావించి సెక్స్ టాక్స్‌కు పచ్చజెండా ఊపుతున్నారు. అతనికి కావాల్సిన సమాచారం అంతా చేజిక్కాక గానీ.. సదరు పురుష పుంగవుడు గోముఖ వ్యాఘ్రం అని తెలుసుకోలేకపోతున్నారు.




సామాజిక మాధ్యమాల్లో సెక్స్‌టోర్షన్ జడలు విప్పుతున్నది. ఈ విశృంఖల క్రీడలో పాల్గొన్నవాళ్లు బాధితులుగా మిగిలిపోతున్నారు. సోషల్ మీడియా పరిధి తెలుసుకోకుండా, పరిమితులు మీరి ప్రవర్తించే వాళ్లే ఫ్రాడ్‌స్టర్ల మెయిన్ టార్గెట్. సో, వారి లక్ష్యం మీరు కావొద్దంటే సోషల్ మీడియాలో తస్మాత్ జాగ్రత్త! అయినప్పటికీ... ఇలాంటి దుస్సంఘటనలు ఎదురైతే బెంబేలెత్తిపోకుండా వెంటనే సైబర్‌క్రైమ్ పోలీసులను సంప్రదించండి. ■

## వదిలిపెట్టొద్దు..

సామాజిక మాధ్యమాల్లో మీకు ఇలాంటి సంఘటనలు ఎదురైతే.. వాటికి సంబంధించిన స్క్రీన్ షాట్లు, వీడియో, ఆడియో రికార్డింగ్‌లు భద్రపర్చుకోండి. పోలీసులకు ఫిర్యాదు చేసేటప్పుడు వీటిని ఆధారాలుగా ఇవ్వడం తప్పనిసరి. దీంతోపాటు సామాజిక మాధ్యమాల వేదికగా ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక వేధింపులకు పాల్పడినా కింది లింక్స్‌ను ఉపయోగించి రిపోర్ట్ చేయండి.

- https://faq.whatsapp.com/2798237480402991/?cms_platform=android&locale=fi_FI" \t "_blank
- https://www.linkedin.com/help/linkedin/answer/42605/report-harassment-or-a-safety-concern?lang=en" \t "_blank
- https://help.twitter.com/en/safety-and-security/report-abusive-behavior" \t "_blank
- https://help.instagram.com/547601325292351" \t "_blank
- https://www.facebook.com/help/1753719584844061" \t "_blank



**అనిల్ రాచమల్ల**
వ్యవస్థాపకులు
ఎండ్‌నౌ ఫౌండేషన్